క్లుప్తంగా

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మక్కువ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూతన వ్యవస్థ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అని విద్యార్థులకు వివరించారు. పీడిత ప్రజలు, స్త్రీల విద్యాభివద్ధికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హరికష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవులను సంరక్షించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మక్కువ: అడవులను సంరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశాఖపట్నం సర్కిల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని సాలూరు రేంజ్ మక్కువ సెక్షన్ దుగ్గేరు బీట్ పరిధి మూలవలస గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులలో నిప్పు పెట్టడం వల్ల ప్రకృతి నాశనమవుతుందన్నారు. అడవులలో గంజాయి సాగు చట్టరీత్యా నేరమని, గంజాయిసాగు చేసిన వారికి జైలు శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. గంజాయికి బానిస కావడం వల్ల జీవితాలు కోల్పోతారని, గంజాయికి దూరంగా ఉండాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మక్కువ అటవీ సెక్షన్ అధికారి కేతిరెడ్డి. నారాయణరావు, బీట్ ఆఫీసర్లు గణపతి, సతీష్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల శాఖాధికారి కరుణాకర్

పార్వతీపురంటౌన్: ఏపీఎస్ఎస్డీసీ ఆధ్వర్యంలో సంకల్పం పథకం ద్వారా ఔత్సాహిక పారిశ్రామి వేత్తల అవగాహన సదస్సు మొదటి రోజు డోకిశీల సచివాలయంలో జిల్లా పరిశ్రమల శాఖాధికారి కరుణాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గ్రామస్తులు వ్యాపార అవకాశాలపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో 30 మంది యువతీయువకులకు అవగాహన కల్పించారు. పరిశ్రమల శాఖ ద్వారా కల్పించే అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖాధికారి కె.సాయికృష్ణ చైతన్య పాలొన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

గరుగుబిల్లి: రోగులకు వైద్యసేవలు సకాలంలో అందించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని పార్వతీపురం మన్యం జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన శుక్రవారం సందర్శించారు. అక్కడి సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, ఓపీ, మందుల నిల్వలు, రక్త పరీక్షలు వంటివి పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే గర్భిణులు ప్రసవం జరిగేలా చూడాలన్నారు. విద్యార్థులు, గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి, విటమిన్ మాత్రలు అందించాలన్నారు. సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం అధికారి వినోద్‌కుమార్, వైద్యాధికారి కె.కె.సాగర్‌వర్మ తదితరులు ఉన్నారు.

దోమకాటు పశువుకు చేటు

- అవగాహన పెంచుకోకపోతే పశుసంపదకు నష్టం



ఆరుబయట కట్టిన పశువులు

బలిజిపేట:

దోమల కారణంగా మనుషులే కాదు పశువులు కూడా అనారోగ్యం పాలవుతాయి. ఈ పరిస్థితిని ముందుగానే అంచనావేసుకుని అవగాహన పెంచుకోకపోతే మూగజీవాల ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలున్నాయి. అకాల వర్షాలు కురిసినప్పుడు, నీటి వాడకాలు ఎక్కువగా ఉన్నప్పుడు పల్లపు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతాయి. దోమకాటు వల్ల మనుషులతో పాటు పశువులు కూడా రోగాల బారిన పడతాయి. దీంతో పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఒక్కోసారి పశువులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. సీజన్ ప్రకారం రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే పాడిపశువులకు గొంతువాపు, దొమ్ము, గాలికుంటు తదితర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. పశువుల్లో ఈ వ్యాధి లక్షణాలను గుర్తించిన వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించి సరైన చికిత్స అందివ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

దోమకాటుతో వచ్చే సమస్యలు

పశువులను దోమలు ఎక్కువగా కుట్టడంతో అవి మేత సరిగ్గా తీసుకోకపోవడంతో పాటు ఆకలి మందగిస్తుంది. ఈ ప్రభావంతో పాల దిగుబడి తగ్గిపోతుంది.

- పశువు శరీర ఉష్ణోగ్రత పెరిగిపోవడంతో రోజురోజుకూ బలహీనపడుతుంది.
- దోమలు కుట్టిన చోట పుండ్లు ఏర్పడతాయి.
- పశువులకు మేతవేసే ప్రాంతం అంతా శుభ్రంగా లేకుంటే దోమలు చేరి పశువులు మేత తినే సమయంలో వాటిని బాధిస్తాయి. దీంతో మేత కూడా సరిగ్గా తీసుకోలేవు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పశువులను ఉంచే పాకలో దోమలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమ తెరలు వాడడం శ్రేయస్కరం. సాయంత్రం పశువులను పాకలో కట్టేముందు వేప ఆకులు లేదా సాంబ్రాణితో పొగ పెట్టాలి. పశువుల శాలల చుట్టూ వ్యర్థాలు, పొదలు లేకుండా శుభ్రం చేసుకోవాలి. పశువులు కట్టే ప్రాంగణాన్ని రోజూ శుభ్రం చేసుకోవాలి. గొర్రెల్లో నీలి నాలుకవ్యాధి వస్తుంది. జాగ్రత్తలు పాటించాలి. టీకాలు వేయించాలి.

జాగ్రత్తలు పాటించాలి

పశువుల శాలల వద్ద జాగ్రత్తలు పాటించాలి. దోమలను నిరోధించే ప్రయత్నాలు చేయాలి. పశువులకు మూడు రోజుల పాటు జ్వరాలు సోకుతాయి. అప్పుడు పశువైద్యశాఖ సూచనలు పాటించి, వైద్యసేవలు అందించాలి.

– గణేష్, మండల పశువైద్యాధికారి, బలిజిపేట

ప్రైవేటు ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు

పార్వతీపురంటౌన్: జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్పనిసరి అని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలో కొత్తగా ప్రారంభించిన కుటుంబ్ ఐవీఎఫ్–ఫెర్టిలిటీ క్లినిక్‌ను శుక్రవారం ఆయన వైద్యబృందంతో కలిసి తనిఖీ చేశారు. ఆరోగ్య శాఖ నిర్దేశించిన ప్రమాణాలు, చెక్ లిస్ట్ ప్రకారం ఉండాల్సిన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల నిర్వహణ తీరు పరిశీలించారు. ఆస్పత్రి రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అవసరమైన అర్హత పత్రాలు, సర్టిఫికెట్లు, డాక్యుమెంట్స్ తనిఖీ చేశారు. క్లినిక్‌లో తనిఖీలకు అవసరమైన పరికరాల లభ్యత, రికార్డుల నిర్వహణ పరిశీలించారు. బయోమెడికల్ వ్యర్థ నిర్వహణ ఏర్పాట్లు, టాయిలెట్ల నిర్వహణ పరిశీలించి ఆరోగ్య అంశాలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ప్రదర్శించాలని సూచించారు. రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడి ఆరోగ్య పరీక్షలకు వచ్చిన వారి పూర్తి వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ఆస్పత్రి ఆవరణ, పరిశుభ్రత తీరు పరిశీలించారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ వై.వివేక్, జిల్లా ఆరోగ్య కార్యాలయ డిప్యూటీ డెమోలు వై.యోగీశ్వర రెడ్డి, వి.సన్యాసిరావు, ఈఓ సత్తిబాబు తదితరులు ఉన్నారు.

వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలి



మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: మండలంలో ద్విచక్రవాహనాలను రోడ్డుపై నడిపే వారు విధిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్సై ఎం. రాజేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని అప్పయ్యపేటలో శుక్రవారం నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో భాగంగా వాహన చోదకులతో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వాహన చోదకులకు విధించిన అపరాధరుసుం ఇంతవరకూ కట్టని వారు చలానాల ద్వారా ఆన్‌లైన్‌లో కట్టాలని సూచించారు.అలాగే ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ ధరించని వారిపై కేసు నమోదు చేయనున్నట్లు చెప్పారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉమెన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు పనులు ప్రారంభం



అంటిపేట కోనేరు వద్ద జరుగుతున్న కల్వర్టు పనులు

సీతానగరం: మండలంలోని అంటిపేట కాలనీ ప్రజలు ఏటా ఎదుర్కొంటున్న రహదారి సమస్యకు మండల పరిషత్ నిధులు విడుదల చేయడంతో సమస్య పరిష్కారమైందని అంటిపేట సర్పంచ్ బి.తిరుపతిరావు, ఎంపీటీసీ ఎస్.నిర్మల అన్నారు. అంటిపేట కాలనీ రహదారిలో మంచినీరు కోనేరును అనుకుని ఉన్న కాలువపై కల్వర్టు నిర్మాణానికి శుక్రవారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో ఇంజినీరింగ్ అధికారులు చేసిన ప్రతిపాదనల మేరకు పలు గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు మంజూరు చేశారన్నారు. ప్రారంభించిన పనులను డీసీసీబీ డైరెక్టర్ ఎ.కృష్ణంనాయుడు, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

పాల రైతుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న పాల రైతులు, నాయకులు

సాలూరు: విశాఖ డెయిరీ పరిధిలో పాలరైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పాలరైతుల సంఘం డిమాండ్ చేసింది.ఈ మేరకు శుక్రవారం పట్టణంలో విశాఖ డెయిరీ పాలకేంద్రం వద్ద పలువురు పాల రైతులు నిరసన తెలియచేసి తమ డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు, పాలరైతుల సంఘం నాయకుడు రాము మాట్లాడుతూ, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్న నేటి పరిస్థితుల్లో, విశాఖ డెయిరీ ఆవు పాల ధరను నాలుగు రుపాయల నుంచి మూడు రూపాయలకు తగ్గించిందని వాపోయారు. ఇదే క్రమంలో దాణా ధర బస్తాకు రూ.750 నుంచి వెయ్యి రుపాయలకు పెంచిందని తెలిపారు. తగ్గించిన పాలధరలను వెంటనే పెంచాలని, దాణాబస్తా 50 శాతం రాయితీ ధరకు ఇవ్వాలని, పాడి పశువుల బీమా సీలింగ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు మహేష్ శ్రీను, రాంబాబు, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ సచివాలయంలో దొంగతనం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామ సచివాలయం వద్ద వీఆర్‌వో పుష్పలత హ్యాండ్‌బ్యాగ్ దొంగతనం జరిగింది. బాధిత వీఆర్‌వో తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి ఎంపీడీవో తదితర అధికారులు గురువారం రావడంతో సచివాలయం వద్ద తన హ్యాండ్‌బ్యాగ్ ఉంచి, గ్రామంలోకి వెళ్లానని ఆ తర్వాత వచ్చి చూసేసరికి అక్కడ తన బ్యాగు లేదన్నారు. తోటి ఉద్యోగులను అడిగితే తమకు తెలియదన్నారని, ఆ బ్యాగులో రూ.3 వేల నగదు, బంగారం చైన్ బిళ్ల, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఏటీఎం కార్డు ఉన్నాయన్నారు. ఇదే ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ సూచించారు. మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ పీవో కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించిన ఆమె.. అక్కడి సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, ప్రీస్కూల్ నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు.



వెంగాపురం రామాలయంలో దీపారాధనలు

19వ పాశురం

బలిజిపేట: ధనుర్మాసం సందర్భంగా వెంగాపురం రామాలయంలో 19వ పాశురం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గోపాలకృష్ణ, ఫణికుమార్ శర్మ, సూర్యనారాయణల ఆధ్వర్యంలో దీపారాధన చేశారు. కుత్తు విళెక్కెరియ (దీపపాశురం)లో స్వామివారి సన్నిధిలో భక్తులు దీపాలను వెలిగించి స్వామివారిని కొలిచారు. ధనుర్మాసంలోని విశేష రోజులలో ఇది ఒకటని, దీనిని ఎంతో గొప్పగా జరుపుకుంటారని అర్చకులు తెలిపారు. తిరుప్పావై ప్రకారం 19వ పాశురం రోజున గోదాదేవి, గోపికలు స్వామివారిని దీపపు కాంతితో ఆరాధిస్తారన్నారు. ఇదే ఈ పాశురం ప్రత్యేకతగా వివరించారు. స్వామివారిని పూలతో అలంకరించి, ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.



గోదారంగనాథులకు దీపహారతి ఇస్తున్న భక్తులు

గోదా రంగనాథులకు దీపహారతి

సాలూరు: పట్టణంలోని పెదకోమటిపేట రామాలయంలో గోదా రంగనాథులకు శుక్రవారం దీపహారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ప్రారంభం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారి

బలిజిపేట: చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న మహిళా సంఘాల సభ్యులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వెలుగు శిక్షణ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారి కె. సాయికృష్ణ చైతన్య శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరంలో కొత్తగా రుణాలు పొందాలనుకునే వారు వారు చేపట్టాల్సిన, చేపడుతున్న వ్యాపారాల అభివృద్ధిని కొనసాగించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి మహిళ పారిశ్రామిక వేత్తగా తయారవాలనే ఉద్దేశంతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి వారికి తగు సూచనలు అందించనున్నట్లు తెలిపారు. వ్యాపారాన్ని నిర్వహించేందుకు అవసరమైన పెట్టుబడి ఒక రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు కొత్త రుణాలను ప్రభుత్వం ఇవ్వనుందని తెలిపారు. వాటితో ఎటువంటి వ్యాపారాలను నిర్వహించాలి, వాటికి అవసరమైన ప్రణాళికలు ఏ విధంగా సిద్ధం చేసుకోవాలనే దానిపై శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఉమామహేశ్వరరావు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓలు సూరిదేముడు, వెంకటరమణ

సీతానగరం: మండలంలోని పాఠశాలలకు నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీ పాలకులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేసి విద్యాభివృద్ధికి తోడ్పడాలని ఎంఈఓ–1,2 జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ అన్నారు. ఈ మేరకు జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఎస్ఎంసీ చైర్మన్‌లు, పాఠశాలల హెచ్‌ఎంలకు శుక్రవారం ఒకరోజు శిక్షణ తరగతులు రిసోర్స్ పర్సన్స్ వెంకటరమణ, రామకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ఎస్ఎంసీల ఎన్నిక వాటి విధులు, విధానాలపై అవగాహన కల్పించుకోవాలని కోరారు.అలాగే ఉపాధ్యాయులు, ఎస్ఎంసీలు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యనందించడానికి సమన్వయంతో పని చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి కృషి చేయాలని కోరారు. విద్యాబోధనకు అవసరమైన వనరులు కమిటీ ప్రతినిధులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యావనరులకేంద్రం సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.



పాల్గొన్న హెచ్‌ఎంలు, స్కూల్ కమిటీ చైర్మన్‌లు

ప్రజారోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి

- మార్క్‌ఫెడ్ జిల్లా చైర్మన్ వై.విమల



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ వై.విమల

సీతానగరం: మండలంలో ప్రజారోగ్యం పట్ల అధికారులు జాగ్రత్తలు పాటించాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ వై.విమల ఆదేశించారు. ఈ మేరకు మండలంలోని జోగింపేటలో శుక్రవారం మండల అధికారులతో గ్రామదర్శిని కార్యక్రమంలో జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ఆమె ముందుగా విద్యాలయాల సముదాయంలో పారిశుధ్య పనులు పరిశీలించారు. జోగింపేటలో అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి, కాలువలు, కాలువగట్టుపైన, కాలువలోఉన్న చెత్తకుప్పలను సచివాలయంలో ఉద్యోగుల రికార్డులను, మంచినీటి వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యపనులు నిర్వహించాలని, మంచి నీరు వాటర్ ట్యాంక్ నుంచి విడుదలైన వృథానీరు ఇంకింప చెయ్యడానికి ఇంకుడు గుంతలు తీయించాలని ఆదేశించారు.గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీకి యార్డుకు అవసరమైన ప్రభుత్వ భూమిని కేటాయించాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించడానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంఈఓ జి.సూరిదేములు, ఏపీఓ భాను, ఏపీఎం రెడ్డి శ్రీరాములు, ఈఓపీఆర్‌ఆర్డీ కె.కుమారవర్మ, వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏళ్ల నాటి భూ సమస్య పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పాచిపెంట: మండలంలోని పద్మాపురంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పద్మాపురం రెవెన్యూ పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న ఏళ్ల నాటి భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పాచిపెంట వీరమనాయుడు, నల్లి గోవిందరావు ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సుమారు నాలుగు వేల ఎకరాల భూమిని 3000 మంది రైతులు సాగు చేస్తున్నారని. గతంలో ఈ భూములకు సంబంధించి వన్‌బితో పాటు రిజిస్ట్రేషన్లు కూడా జరిగేవన్నారు. అయితే కొంతమంది వ్యక్తులు ఈ భూములు ఇనాం భూములని చెప్పి కోర్టుకు వెళ్లడం వల్ల కోర్టు నుంచి ఎటువంటి తీర్పు రాకుండానే రెవెన్యూ అధికారులు మాత్రం 2014 నుంచి వన్ బి ఇవ్వడం నిలిపివేశారన్నారు. దీని మూలంగా రిజిస్ట్రేషన్‌లు కూడా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాతల కాలం నుంచి తాము సాగు చేస్తున్న భూములకు వన్‌బీలను రెవెన్యూ అధికారులు ఇవ్వని కారణంగా ప్రభుత్వం నుంచి రైతులకు వస్తున్న రాయితీలు అందడం లేదన్నారు. అంతే కాకుండా బ్యాంకులు సైతం రుణాలు ఇచ్చే పరిస్థితి లేదని, ఈ భూ సమస్య సకాలంలో పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ప్రమీల, స్థానిక సర్పంచ్ బడ్నాన వీరయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.